
# శాంతి

# SANTI

విశ్వమానవ సౌభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

January / జనవరి -2025

ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయోభవేత్



**పరమపూజ్య శ్రీ స్వామి ఓంకార్ మహారాజ్**

జననం : 1895　　మరణం : 1982

## లోకశాంతి ప్రార్థన

(వ్యక్తి శాంతికి - విశ్వశాంతికి)

పూజనీయమైన ఓ దివ్య స్వరూపా!
మా లోపలను వెలుపలను మీదను క్రిందను అంతటను
నిండియున్న ఓ సర్వాంతర్యామి! మా లోపల ప్రత్యణువు
నందును ఇమిడి యుండి మా నేత్రములకు నేత్రము,
కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము,
మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, ప్రాణములకు ప్రాణము,
ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా! ప్రేమైక మూర్తీ !
నిన్ను తెలుసుకొను భాగ్యము ఇప్పుడు ఇచ్చటనే మాకు ప్రసాదింపుము.
ఓ తేజోమయమూర్తీ! తూర్పు పడమరల
ఉత్తర దక్షిణముల, ఈ విశ్వము నందంతటను అందరును
నీ దివ్య తేజస్సును గ్రహింతురు గాక!
ఓ సచ్చిదానంద స్వరూపా !
ప్రతి మానవ హృదయమునందును, నానాజాతి మధ్యమునను
శాంతి సామరస్యములను ప్రతిష్ఠింపజేయుము.
ఓ దేవా! ఇదియే మా మనః పూర్వకమైన ప్రార్థన.

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఏకం సత్ విప్రా బహుధా వదంతి
ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.

– ఋగ్వేద సంహిత

# శాంతి

# SANTI


**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

VoL./ సంపుటి : 101    January / జనవరి–2025    No./ సంచిక : 1


| వ.నెం. | విషయసూచిక | పేజి నెం. |
|---|---|---|

| 1. | ప్రార్థన– వివేక చూడామణి | 2 |
| 2. | ధ్యానము – అద్వైత తారావళి | 2 |
| 3. | నూతన సంవత్సర సందేశము | 3 |
| 4. | స్వామి జన్మదిన సందేశము | 4 |
| 5. | శ్రీ ఓంకార్ ఆత్మకథ – అనువాదం : బొప్పన అరుణాదేవి | 3 |
| 6. | ఆనంద రామాయణము – పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద | 9 |
| 7. | గురువాచకకోవై – మురుగనార్ | 12 |
| 8. | మానసోల్లాసము – శ్రీ వింజమూరి రాధాకృష్ణ | 15 |
| 9. | సుఖము–ఆనందము–శాంతి– పూర్ణ చైతన్య | 18 |
| 10. | కార్యక్రమములు – విరాళములు | 25 |



**ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులుకాని, సంపాదకులు కారు.**


**జీవిత సభ్యత్వం రూ. 1000/– లు సాలుసరి రూ. 100/–**



# ప్రార్థన

**తీవ్రధ్యానంలో ఇంద్రియాలు కట్టుబడతాయి**

**శ్లో॥ స్వామిన్నమస్తే నతలోకబన్ధో**
**కారుణ్యసిన్ధో పతితం భవాబ్ధౌ ।**
**మా ముద్ధరాత్మీయ కటాక్ష దృష్ట్యా**
**ఋజ్వ్యాతి కారుణ్య సుధాభి వృష్ట్యా॥**

**తా॥** ఓ స్వామీ! భక్తిభావంతో నిన్ను శరణన్న వారలకు బంధువా! కృపాసాగరా! నీకు నమస్సులు; ఈ భవాబ్ధిలో పతనమయి కూరుకుపోయిన నన్ను రక్షించు; కరుణామృతాన్ని వర్షించే నీ కారుణ్య పూర్ణ వీక్షణంతో నాకు ముక్తిని ప్రసాదించు. **–వివేక చూడామణి**

# ధ్యానము

**శ్లో॥ అఖిలాగమాంత లక్ష్యం – హానోపాదానహీన చిన్మాత్రమ్ ।**
**అనుభూతి మాత్మ గమ్యం – బ్రహ్మైవాహం తదస్మి పరిపూర్ణమ్ ॥**

**తా॥** ఉపనిషత్తులన్నియును బ్రహ్మమునే రక్షించుచున్నవి. తరుగుట–పెరుగుట అన్నది లేక చిన్మాత్రముగా (కేవలము జ్ఞాన స్వరూపముగా) అనుభవమునకు మాత్రము అందుచున్న – ఆ బ్రహ్మము నేనై యున్నాను. అంతటను నిండియున్న ఆ బ్రహ్మము నేనే! **(అద్వైత తారావళి)**

సత్యమును అనుగమించుట కత్తిపై నడుచుట కంటె కష్టమని చెప్పియున్నారు. కాని సరియగు అభ్యాసముచే సులభమగును. సాధనచే మిక్కిలి దుర్లభమైన పథమైనను సుగమమగును. అనురాగము సర్వబంధములకు మూలము. విరాగము పరిపూర్ణ స్వేచ్ఛకు మూలము. నీ శ్వాస శరీరమునుండి ప్రవహించు చున్నను, శరీరము నుండి ఎట్లు వేరుగా నున్నదో చూడుము. జనన కాలమున అందు ప్రవేశించినది; మరణ కాలమున శరీరము నుండి నిర్గమించును. కావున బుద్ధిమంతుడైనవాడు తన శ్వాస విధానమునను గమించును. శాంతిసుఖములను పొందుటకు అది సులువైన మార్గము.

**–స్వామి ఓంకార్**

ముక్తి అందరికీ కావాలి. అది ఏ కొద్దిమందికోసమో ఏర్పరచబడినది కాదు. అజ్ఞానాంధకారంలో అల్లాడే సోదరమానవాళిని ఉద్ధరించాలి. అంతేకాని ఎవరికీ సాయపడకుండా మనమే ఆ ఆధ్యాత్మికామృతాన్ని గ్రోలడం స్వార్థం అవుతుంది. ఆ దివ్య సుధను మన సోదరులకు పంచియివ్వాలి. మన ఆధ్యాత్మిక అనుభూతి ఎదిగి అభ్యుదయానికి వినియోగించాలి. అదే జీవన్ముక్తులు చేయవలసిన పని.

**–స్వామి ఓంకార్**

## నూతన సంవత్సర సందేశము

### ప్రార్థన

ప్రభూ! ఈ నూతన సంవత్సరమున యేమని నీకు ప్రార్థన జేయుదును? ప్రార్థన, నన్ను నీలో విలీనము జేయుచు జీవాత్మ పరమాత్మల ఐక్య సంధానమును గల్గించునట్లు చేయుము. ఎవరని నిన్ను నిర్ణయించేదిరా? నీవు యెచ్చట యున్నావు నా దైవమా! నీవు దూరముగాయున్న, నీకు వినిపించుటకు బిగ్గరగా ప్రార్థన చేయవలెను, నీవు దగ్గరలోనే ఆంతర్యముననే యున్న, నెమ్మదిగానే, నిశ్శబ్దములోనే ప్రార్థన చేయవలెను.

అంతా రామమయం, ఈ జగమంతా రామమయం గాన, సర్వములో సర్వత్రా సదా నిన్నే గాంచుచు, మా నూతన సంవత్సరమును ప్రారంభిచెదము గాక! నీవు అద్వితీయుడవై, సర్వము నిండి, సర్వజ్ఞతతో వెలసియుంటినిగాన, మా స్వార్థ రహితమైన జీవితమునే గొప్ప ప్రార్థనగ జేయుము.

మొక్కను, పక్షిని, జంతువును, మానవుని ఒకేరీతిగా విశ్వప్రేమతో ప్రేమించెడివారే నిజమైన ప్రార్థనను జేయుచుండిరి. ఈ నూతన సంవత్సరమున మానవకోటినంతను, స్వార్థ రహితముగా ప్రేమించుచు, అందరిలో నిన్నే దర్శించుచు, ప్రేమించుచు విశ్వశాంతితో, నిశ్శబ్దముగా, సర్వులలో పూజించుటయే మా నిజమైన, శాశ్వతమైన, స్థిరమైన ఏకైక ప్రార్థనగా సదాయుండనిమ్ము.

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః**

**(శాంతి జనవరి 1969)**

## పరమపూజ్య శ్రీ ఓంకారస్వామివారి జన్మదిన సందేశము

**ఓం నమస్తే సతేతే జగత్కారణాయ**
**నమస్తేచితే సర్వలోకాశ్రయాయ**
**నమోద్వైత తత్వాయ ముక్తిప్రదాయ**
**నమో బ్రహ్మతే వ్యాపినే శాశ్వతాయ**

దైవ సాన్నిధ్యములోనికి మీ అందరకును సుస్వాగతము. మీ అందరి ప్రేమకు నా హృదయము సంపూర్ణత్వము నొందుటచే అందుండి మాటలు వెలికి వచ్చుటలేదు. మీ ప్రేమకు కృతజ్ఞుడను. భక్తిపూరితములగు మీ హృదయములను దివ్య ప్రేమచే స్పృశింపవలెనని నా హృదయము కోరుచున్నది.



వాస్తవమునకు జన్మదినము దివ్యజ్యోతిని గుర్తించ గలిగినపుడే లభించును. సాధారణముగా ఇట్టి వేడుకలు ముఖ్యములు, అముఖ్యములు అని రెండు విధములు. బాహ్య ఆడంబరములు, ఈ నామరూపములకు కావించుచున్న వన్నియు అముఖ్యములు, ఇప్పుడైనను ఆంతర్య జ్యోతిని గుర్తించి, శాంతి ప్రేమలతో హృదయమును పవిత్రీకరించుకొనుట ముఖ్యము. కాని ఎందరు ఆవిధమగు అంతర్విమర్శ చేసుకొనుచుండిరి? మీకు యీ జన్మదిన సమయమున నన్నానందింప జేయవలయునని నిజమగు కోరిక యున్న యెడల ఆ దైవమును సర్వే సర్వత్రా గుర్తించి ప్రేమించుడు. అదియే నాకు ఆనందమును చేకూర్చునది.

మఱ్ఱిచెట్టు ఎంతకాలము జీవించినా ఒక్కటే. నేను 81 సం॥ జీవించినా ఇంత వరకు పుట్టనే లేదనుకొందును. ఎప్పుడు మీ హృదయములలో జ్యోతిని వెలిగించ గలుగుదునో అప్పుడే నేను పుట్టినట్లు భావిస్తాను.

మనము గుర్తించినా గుర్తించకున్నను దైవము మన హృదయగుహలో సదా మన కొఱకై నిరీక్షించుచుండెను. నిశ్శబ్దముగ ఆంతర్యమునకు జని గుర్తించుటయే మనము చేయవలసినది. ఈ జన్మదిన జ్ఞాపకార్థముగా ఆ దైవమును క్షణములో కోట్యంశమైనను మరువకుడు. నేను బ్రహ్మ ముహూర్తమున నిద్రలేచుచు యీ సమస్తము నేనే అనియు, దైవమునకు నా శరీరము తప్ప అన్య శరీరములేదనియు భావించుచుందును. నేను తినినా, త్రాగినా ఏది చేసినా సర్వులకై చేయు చుందును. మూడుకోతుల చిన్నబొమ్మ, నాకెల్లప్పుడు ఉత్సాహము నిచ్చు చుండును. ఆ మూటి సందేశము నాకు ప్రీతిపాత్రము. వాటివలె నేనెన్నడును చెడును చూడకుందును గాక! చెడు వినకుందును గాక! చెడు మాట్లాడకుందును గాక! సర్వజగత్తునందును ఆ దైవమునే గాంతును గాక! సర్వ శబ్దములలోను ఆ దైవమునే విందును గాక! దైవేతరమైన పల్కులెవ్వియు నానోటినుండి వెలువడ కుందు గాక! నన్ను ప్రేమించిన వారిలో ద్వేషించిన వారిలో కూడ దైవమునే గాంతును గాక!

నేను చెప్పిన మాటలన్నియు మరచిన మరతురు గాక! కాని మీఆంతర్య జ్యోతి నెన్నడును మరువవలదు. మీ తనువు యను జగత్తులన్నియు ఆ దైవమే కావలయును. మీరు చేయు ప్రతికార్యము ఆ దైవ ధ్యానముతోడనే చేయుడు. ముమ్మారు ప్రణవగానము చేయుచు, మన శ్వాస, పని, జీవితము సర్వము ఆ దయామయుని కొఱకే చేయుదుము గాక యనెడి ప్రతిన గైకొందము.

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః**

# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామిజీ ఆత్మకథ

**మూలం : స్వామిఓంకార్** **అనువాదం : బొప్పన అరుణాదేవి**

(గత సంచిక తరువాయి) **అధ్యాయం - 57**

## షష్టిపూర్తి-జనవరి 1956- కుమారి జ్ఞానేశ్వరి

భగవంతుని ఆశీస్సులతో, మీ అందరి ప్రార్థనలు, మంచి కోరికల వలన స్వామీజీ షష్టిపూర్తి మహోత్సవము చాలా విజయవంతంగా జరిగింది. ఆశ్రమము చరిత్రలో నలభై సంవత్సరాలలో ఇంత పెద్ద కార్యక్రమము జరగటము ఇదే మొదటిసారి. రాత్రి పగలు తేడా లేకుండా ఎంతో భక్తిశ్రద్ధలతో భక్తులు పెద్ద గుంపులుగా ఆశ్రమాన్ని దర్శిస్తూనే ఉన్నారు. పదిరోజుల ఉత్సవాలలో నలభై వేల మంది భక్తులు భోజనాలు చేశారు. ఆ ఉత్సవాల రోజుల్లో ఏకాహం, భజనలు, ప్రార్థనలు జరిగాయి. కనీసం వేయిమందికి తక్కువ కాకుండా పాల్గొని భగవన్నామాన్ని నిరంతరాయంగా ఇరవై నాలుగు గంటలూ జపించారు. జీవం ఉట్టిపడుతున్న నిలువెత్తు సైజులో శ్రీకృష్ణుడు, భగవాన్ జీసస్ క్రీస్తు, భగవాన్ బుద్ధుడు, మహాత్మాగాంధీ గారి విగ్రహాలు నూతనంగా ఆవిష్కరించబడ్డాయి. అవి అందరి దృష్టిని ఆకర్షించి ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని కల్గించాయి భక్తులకు. మంచి పండితులు, వక్తలు దగ్గర నుండే కాకుండా సుదూర ప్రాంతాల నుండి కూడా వచ్చి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రవచనాలు అందించారు. శ్రోతలు హరికథలు, బుర్రకథలు విని ఆనందించారు. అనేక సాంస్కృతిక బృందాల వారు, సంగీత కచేరీలు చేశారు. వీణ, వయోలిన్ మొదలైన పరికరాలపై చక్కని సంగీతాన్ని వినిపించారు. భరతనాట్య ప్రదర్శనలు కూడా జరిగాయి. మా ఆశ్రమ నిర్వహణాధికారి శ్రీ దాదాబాయి గారు కర్ణాటక సంగీతాన్ని వినిపించారు. ప్రపంచంలోని అనేక దేశాల నుండి ముఖ్యంగా అమెరికా, కెనడా, యూరప్, చైనా, మలేషియా, ఆస్ట్రేలియా, జర్మన్ మొదలైన ప్రాంతాల నుండి, భారతదేశంలోని పలు ప్రదేశాల నుండి భక్తులు తంతి ద్వారా, సందేశాలు, కానుకలు పంపించిన వారందరికి మా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాము.

"కోటిపత్రి పూజ" కార్యక్రమాలకు హాజరయిన వేలాదిమంది భక్తులను ఆధ్యాత్మికంగా ఎంతో అలరించింది. యాభై మందికి పైగా దంపతులు ఈ మహాక్రతువులో పాల్గొని తరించారు. అందులో విశ్వశాంతి చిహ్నాన్ని మిలియన్ల కొద్ది బిల్వపత్రాలతో పూజించారు. షష్టిపూర్తి మహోత్సవాలు జరిగిన పదిరోజులు



ఈ కార్యక్రమం జరిగింది. చివరిరోజయిన పూర్ణాహుతి రోజున అందరూ సంపూర్ణ శరణాగతి చెందుతూ అహంకారము అనే అజ్ఞానాన్ని జ్ఞానాగ్నిలో దగ్ధం చేసినట్లుగా, పూజారులు ప్రపంచంలోని సమస్త దేవతలకు ఆహుతులు సమర్పించారు. పరమ పవిత్రమయిన హవన కార్యక్రమంపూర్తి అయిన తర్వాత నిరుపేద ప్రజలందరికీ అన్నదానం జరిగింది.

మన పురాణ ఇతిహాసాల్లో, ఋషులు చెప్పినట్లుగా దేవతలు, భగవంతుడు ఈ విధమయిన పవిత్ర ఆధ్యాత్మిక కార్యక్రమాలు, పూజలు, యజ్ఞాలు జరిపించినపుడు వారు సంతృప్తి చెందినప్పుడు ఆశీర్వాద రూపంగా అమృత వర్షాన్ని కురిపిస్తారట. అప్పుడు వర్షాకాలము కాకపోయినప్పటికీ ఆకాశము ఎంతో నిర్మలంగా ఎలాంటి మబ్బులు లేకపోయినా యజ్ఞ కార్యక్రమం, పూర్ణాహుతి, నిరుపేదలకు అన్నదానము పూర్తి కాగానే అకస్మాత్తుగా మొదలయి దాదాపు గంటసేపు ఆగకుండా వర్షం కుమ్మరించినట్లుగా పడింది. భక్తులందరూ అంత వర్షంలో కూడా ఆఖరిరోజు కావటం వలన, ఎంతో శ్రద్ధగా దేరాల క్రింద నిలబడి మహాత్ముల సందేశాలను శ్రవణం చేశారు.

భగవంతుని దివ్య వైభవముతో, ఆయన అనుగ్రహముతో అన్ని కార్యక్రమాలు ఎంతో సంతోషంగా, భక్తులందరి హృదయాల్లో పరమాత్మ దివ్యానుభవాన్ని నింపాయి. దాదాపు నూటయాభై చిత్రాలు ఎంతో ముఖ్యమయిన కార్యక్రమాలకు సంబంధించి తీయబడ్డాయి. అందులో కొన్ని రాబోయే శాంతి పత్రికలో ప్రచురించ దలిచాము. పరమపూజ్య స్వామీజీ గారి ముప్పై పైగా ఎంతో ఉత్తేజభరితమయిన సందేశాలు భక్త సమ్మేళనములో, ప్రార్థనా మందిరాల్లో వినిపించబడ్డాయి.

**ఓం శాంతి.... శాంతిః**

## నాతో కలిసి జీవించే వారి నుండి నేను ఏమి ఆశిస్తున్నాను

## స్వామి ఓంకార్ పీస్ పత్రిక 1956

జాగరూకతతో, ఎప్పుడూ ఏదో ఒక పనిచేస్తూ నూటికి నూరు శాతము భగవంతుని దివ్య తేజస్సును లోపలా, బయటా కూడా దర్శించాలని కోరుకుంటాను. నాకు సోమరితనంతో ఉండేవారికి చూస్తే చాలా బాధగా ఉంటుంది. భగవంతుడు ప్రసాదించిన అమూల్యమయిన జీవితాన్ని ఏ పనిచేయకుండా శక్తిహీనుడిలా ఉండే వారిని చూస్తే బాధ వేస్తుంది. ఆశ్రమంలో జీవితం గడపాలి అంటే కేవలం ఒక్కటే నియమము ఉంది. వారు ఎల్లప్పుడూ ప్రతి క్షణము పరమాత్ముని దివ్యానుభూతిలో గడపాలి.

ఆశ్రమ శ్రేయోభిలాషులు, స్నేహితులు, ఆశ్రమాన్ని దర్శించడానికి వచ్చేవారు, శాంతి ప్రార్థనలు చేసేవారు ప్రతి ఒక్కరూ కూడా ఆశ్రమంలో నివసించినప్పుడు వారందరూ ప్రతిక్షణము వారి బాహ్య జీవితంలోని బాధలు, కష్టాలు, ఇబ్బందులు అన్నింటిని మర్చిపోయి ఆనందంగా భగవదనుభూతిలో కాలము గడపాలని నేను కోరుకుంటాను.

ప్రతి క్షణము కూడా ఎంతో అమూల్యమయినది కనుక నేను ప్రతిక్షణము గాఢమయిన ధ్యానము లేదా నిస్వార్థమయిన సేవలో వినియోగించుకోవాలని కోరుకుంటాను. తెలిసి గాని, తెలియకుండా గాని కాలాన్ని వృథా చేయటము, అనవసరమయిన మాటలు మాట్లాడటము, గుసగుసలాడుకోవటము, ఇతరుల గురించి చెడుగా ప్రచారము చేయటము ఆధ్యాత్మిక జీవితం గడిపేవారికి చాలా కీడు చేయటమే కాక ప్రమాదకరం కూడా అవుతాయి. అలాంటి వ్యక్తులు నా చుట్టూ ఉండి సమయాన్ని వృథా చేస్తూ జీవితాన్ని పాడు చేసుకుంటుంటే నాకు జ్వరం వచ్చినట్లుగా అనిపిస్తుంది. సోమరులకు, స్వార్థపరులకు ఆశ్రమంలో గాని, నా హృదయంలో గాని ఎలాంటి స్థానము ఉండదు. అనవసరపు ఉపన్యాసాలిచ్చే వారన్నా, భోజన ప్రియులన్నా నాకు భయము. అతిగా తినటము, భోజనము మధ్యలో ఏదో ఒకటి నమలటము, చిరుతిళ్ళు తినటం, ఎలాంటి భేదము లేకుండా ఏదో ఒకటి తినటము వలన పగటిపూట నిద్ర వస్తుంది. సోమరితనము శక్తిహీనత అన్ని విషయాల్లో కనిపిస్తుంది.

విచారవదనము, నిస్సహాయతతో కూడిన ముఖంతో వ్రేలాడే వాళ్ళను చూడటం నాకు ఇష్టం ఉండదు. ఉత్సాహపూరితమైన, చిరునవ్వుతో కూడిన ఆహ్లాద కరమైన ముఖాలు, హృదయం నిండా సంతృప్తి, భగవంతుని దివ్యమయిన అనుభూతిలో మునిగి తేలేవారంటే నాకు చాలా ఇష్టము. సోమరితనము నిద్రకు, శక్తిహీనతకు, ఉత్సాహాన్ని చంపివేసి అపవిత్రతకి దారితీస్తుంది. చిన్నగా కునుకు తీయటము, సోమరితనము ప్రమాదకరము. ఈ క్రింది కవితలో ఎంత యథార్థమయిన తెలివయిన అర్థమున్నదో గమనించండి.

"స్వర్గలోకపు వాకిళ్ళ ముందు ఒక నిరుపేదవాడు వేయి సంవత్సరాలు వేచి ఉన్నాడు. కాని ఒక్కక్షణం ఆదమరచి చిన్న కునుకు తీసి నిద్రలోకి జారిపోయాడు. స్వర్గద్వారాలు తెరుచుకొని, మూసుకుపోయాయి. అయ్యో! అతను తెలివయిన వాడేనా?"

సోమరి జీవితాల వలన ఈ విధంగా హాని జరుగుతుంది. మతిమరుపు



లేదా అశ్రద్ధ ఏవిధంగానూ మేలు చేయదు. "సోమరిపోతు మెదడు దెయ్యాలకి నిలయము" అని పెద్దలు చెప్పిన వాక్యాలలో ఎంతో సత్యమున్నది. ఒకవేళ మనము ధ్యానము, ప్రార్థనల్లో లేకపోయినా ఏదో ఒక పనికివచ్చే పనిలో నిమగ్నమవ్వాలి. దాని వలన ఇతరులకు మేలు జరగాలి. పనిచేయటమే భగవంతుని పూజ. అది మనలను సోమరితనము నుండి దూరంచేస్తుంది. పనిచేయటం వలన ఎవ్వరూ మరణించరు గానీ సోమరితనము, ఆందోళన మనుష్యులను చంపివేస్తుంది.

నాతో కలిసి జీవించే ఆధ్యాత్మికోన్నతి పొందిన ఆత్మస్వరూపులు, కలిసి పనిచేయక పోయినా విశ్వప్రేమికులయినవారు, నిస్వార్థంగా ఎలాంటి బిరుదులు ఆశించకుండా సేవలందించేవారు, అందరినీ ప్రేమించేవారు, భక్తులు, ప్రేమ స్వరూపులు మొదలైన వారందరిని నా సొంత రక్తసంబంధీకులుగా భావిస్తాను. స్వార్థపరులు, పేరుప్రతిష్ఠలకోసం ప్రాకులాడేవారు, భౌతికమయిన సుఖభోగాలనే మబ్బుల వెంట పరుగులు తీసేవారు, రక్తం పీల్చేవారు అని భావిస్తాను. వారు నా సొంత రక్తసంబంధం కల్గిన వారయినా సరే. వారు నా రక్త సంబంధీకులయినా, కాకపోయినా, ఆత్మ సోదరులపట్ల వయస్సులో పెద్దవారయినా సరే లేదా చిన్నవారయినా సరే, వారు నిస్వార్థపరులయితే కనుక, అంకిత హృదయం కలవారైతే కనుక, ఉన్నతోన్నత స్తుతిని పొందిన వారయితే కనుక, స్తుతినిందలకు అతీతులయితే కనుక, భౌతిక ప్రపంచపు నీలి నీడల వెనుక పరుగులెత్తని వారయితే కనుక వారి ముందు నా తల వంచి ఆరాధిస్తాను. వారిని పూజిస్తాను. అలాంటి పవిత్రమయిన ఆత్మజ్ఞానులకి ప్రతి నిముషము ఎంతో అమూల్యమయినది. జీవితంలో ప్రతిక్షణము కూడా అమరమయిన, శాశ్వతమయిన ఆనందాన్ని హృదయానికి అందిస్తుంది.

నా ఆశ్రమంలో నాతో కలిసి జీవించే ఆశీర్వదించబడిన పవిత్ర ఆత్మ స్వరూపులు అందరి వద్ద నుండి నూటికి నూరు శాతము మంచి కార్యదక్షత, నిస్వార్థమయిన సేవలు, గాఢమయిన ధ్యానస్థితి, మహోన్నతమయిన స్థిరమయిన మౌనస్థితిని నేను ఆకాంక్షిస్తున్నాను.

## నా జీవితంలో అత్యంత విలువైన క్షణాలు – నవంబరు 18, 1956
## – స్వామి ఓంకార్

ఆ రోజు ఆదివారము, సూర్యోదయ సమయము. ఆనాడు పూర్ణిమ. నిండు జాబిలి రోజు. ఆశ్రమ వాసులు, భక్తులు భక్తిశ్రద్ధలతో 'ఏకాహం' చేస్తున్నారు. పౌర్ణమి రోజు ఆశ్రమవాసులు ఇరవై నాలుగు గంటలు నిరంతరాయంగా భగవన్నామాన్ని జపిస్తారు.

ప్రతి రోజులాగే ఆరోజు కూడా తెల్లవారుఝామునే నిద్ర లేచి "నా ఆధ్యాత్మిక సాధన" "ఆధ్యాత్మిక మెరుపులు", "అష్టావక్రగీత" మొదలయినవి చదువు కుంటున్నాను. భక్తుల ఉత్తరాలకు సందేశాలు వ్రాయడానికి బదులుగా నేడు నేను శాంతి ప్రార్థనని పదే పదే చేస్తూ, గాఢమయిన ధ్యానములో కాలాన్ని సద్వినియోగం చేయాలని నిర్ణయించుకున్నాను.

ఉదయాన్నే ఒక గంటసేపు తోట పనిలో గడిపాను. తర్వాత స్నానం చేశాను. డా॥ మాధవరావు గారు, డా॥ మార్కండేయ గారు నిర్వాణ మందిరంలో సంచార వైద్యశాలను ప్రారంభించడానికి నాతో సంప్రదించడానికి వేచి ఉన్నారు. వారు వెళ్ళిపోయిన తర్వాత నేను కొద్దిగా పాలు, పళ్ళు ఉపాహారంగా తీసుకున్నాను. తర్వాత ఉదయము 9–30 ని॥లకు నా బల్ల వద్ద కూర్చుని ఏవైనా వ్రాసుకోవాలని, పరమాత్మ దివ్యానుభూతిని పొందాలని భావించాను.

హఠాత్తుగా, ఎంతో అద్భుతం జరిగిపోయింది. నా పాదాల వద్ద ప్రారంభ మయింది. నా పాదాలు భూమిని తాకటం లేదు. నా పాదాల్లో తిమ్మిరిగా అనిపించి స్పర్శ తెలియడం మానివేసింది. గాలిలో తేలిపోతున్న అనుభూతి కల్గసాగింది. భౌతిక దేహము కనుమరుగు అయిపోయింది. ఒక విధంగా అది శూన్యంలోకి ఆవిరి అయినట్లు ఉంది. ఆ దివ్యానుభూతిని మామూలు మాటల్లో వర్ణించి చెప్పటం సాధ్యముకాదు. అనుభవం లోనికి వచ్చినప్పుడు మాత్రమే అర్థమవుతుంది. అలాంటి అరుదయిన అనుభవం ఎవరి జీవితంలో అయినా చాలా అరుదుగా వస్తుంది.

నేను ఒంటరిగా గదిలో ఉన్నాను. తలుపులు వేయటానికి ప్రయత్నించి విఫలమయ్యాను. అది ఒక దివ్యానుభూతి, తన్మయత్వ స్థితి. నా శరీరం నుండి శ్వాస తీసుకోవటం కూడా ఒక్క క్షణం ఆగిపోయిన అనుభూతి కల్గింది. నా తల వెనక్కి వాలిపోయింది. బాహ్యస్మృతి కోల్పోయినట్లుగా ఉంది. కాని "నేను ఉన్నాను' అనే మహోన్నతమయిన స్థితి నాకు అనుభవంలోనికి వస్తోంది. ఈ అనుభవము స్పృహ కోల్పోవటం కాని లేదా భౌతికమయిన శరీరానికి మూర్ఛ వంటిది రావటం గాని కాదు.

పరమాత్మ దివ్యానుగ్రహము వలన నేను చాలా ఆరోగ్యంగా, ఉత్సాహంగా, బలంగా ఉన్నాను. నా శరీరంలో ఎలాంటి లోపము లేదు. ఆ దివ్యానుభవం తర్వాత కొంతసేపటికి నేను యథాస్థితికి వచ్చేశాను. అప్పుడు కూడా ఇంకా కొద్దిగా నా శరీరము తేలిపోతున్నట్లుగానే అనిపించసాగింది.

ఈ అద్భుతమయిన అనుభవం నాకు స్వామి వివేకానందుడి గురువు



శ్రీ రామకృష్ణ పరమహంస తాకినప్పుడు ఆయనకి కల్గిన పవిత్రమయిన సమాధిస్థితిని గుర్తుకు తెచ్చింది. ఇక్కడ నేను సర్వాంతర్యామి, సర్వత్రా నిండి నిబిడీకృతమైన ఆ సర్వేశ్వరుడి అనుగ్రహస్పర్శను అనుభవించాను.

ఒక అమెరికన్ సాధకుడికి అకస్మాత్తుగా కల్గిన ఆధ్యాత్మిక అనుభవాన్ని కూడా నాకు గుర్తుకు తెస్తోంది. ఆయన పనిచేసుకొంటున్నప్పుడు కల్గిన అనుభవాన్ని ఆయన ఒకగ్రంథంగా ప్రపంచానికి అందించాడు. "అమరత్వంలో ఏడుక్షణాలు" దాని పేరు.

**అమరమయిన క్షణాలు**

నా ప్రయత్నం లేకుండానే, నాకు ఏర్పడిన ఆ దివ్యానుభవము నాకు గుర్తుకు వచ్చినప్పుడు నేను దాన్ని వివరంగా తెలియచేయలేకపోతున్నాను. అది అన్నింటికి అతీతమయినది. భగవంతుడు ప్రసాదించిన వరప్రసాదం, అమరమైనది, శాశ్వత మయినది. అది విశ్వ సంబంధమయిన సంతోషము, అన్నింటికి అతీతమయిన ఆనందము. అక్కడ నేను మహోన్నతమయిన స్థితికి చేరుకున్నాను. అక్కడ కాలము స్తంభించిపోయింది. బుద్ధి కరిగిపోయింది. అనంత తత్త్వంలోనికి నేను చేరుకున్నాను.

**ఓం...ఓం...ఓం..**

సత్యాన్వేషి యగువాడు యీ శరీరము గూర్చి చింతింపరాదు. ఎంతవరకు శరీరము ధరించియుందుమో అంతవరకు ఏదో ఒక రూపమున రుసుము చెల్లించ వలసినదే, శరీరము అద్దె కొంపవంటిది. లక్షాధికారి అయినను, సాధువైనను, సన్యాసి అయినను, ఎవరయినను రుసుము చెల్లింపక తీరదు. కావున ఎవ్వరైనను యీ శరీరము విషయమై చింతింపక, దైవమునే స్మరింపవలెను. అట్టివాడే నిజమైన సత్యాన్వేషి కాగలడు. **–స్వామి ఓంకార్**

ప్రవృత్తి చదువులు ఎన్నియైనను చదువవచ్చును. తెలివైన వాళ్ళమని తమ తెలివితేటలతో, పాఠశాలలో గురుకులములో చదువుకున్న బాలబాలికలే గాక చివరకు కొందరు ఉపాధ్యాయులు కూడ సర్వజ్ఞుడు, సర్వాంతర్యామియైన దైవమునే మోసపుచ్చుచు, అమూల్యమైన కాలమును వ్యర్థపుచ్చుచు జీవించుట చాల విషాదకరము. **–స్వామి ఓంకార్**

నేడే మనది రేపు మనది గాదు అనెడి సత్యమును మరువవలదు. ప్రేమయే దైవము. దైవమే ప్రేమ. ప్రేమ యున్న చోటనే దైవముందునన్న సూక్తులకు ఆచరణలో మన దినచర్యలో చూపవలెను. ప్రేమ లేని హృదయము అది మీదే యైనను, నాదేయైనను, ఎవరిదైనను సరే స్మశానము వంటిదను సత్యమును మరువవలదు. **–స్వామి ఓంకార్**

# ఆనంద రామాయణము

(గత సంచిక తరువాయి) **పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద**

**యద్భవిష్యతి భవతు తదగ్రే త్యజ కాననే ।**
**కాలాంతరేణ యో మృత్యు స్తమద్య త్వం కిమిచ్ఛసి ॥ 251**

**ఇతి భార్యావచః శ్రుత్వా తూష్ణీమాస దశాననః ।**
**తతః సా పేటికా దూతైః నీతాయానేన వై జవాత్॥ 252**

**పశ్యన్ వనాని సర్వాణి సీతాయై మైథిలస్య చ।**
**కృతా భూమిగతా దూతైః తదాసర్వైః కరండికా ॥ 253**

**తతో యయుః పునర్లంకాం దూతాస్తే రావణస్య చ ।**
**న్యవేదయన్రావణాయ సర్వం వృత్తం యథాకృతమ్॥ 254**

**సా భూమిః సూర్యగ్రహణే విదేహేన సమర్పితా ।**
**బ్రాహ్మణాయ ద్విజశ్చాపి తాం కర్షయితుముద్యతః॥ 255**

అంతనట్లే రాక్షసులు ఆమెను పెట్టెతోడ విమానమున పెట్టుకొని వెడలునపుడు మండోదరి ఇట్లనియె, "దీనిని భూమిలో పాతిపెట్టదగును. వెలుపల ఉంచదగినది కాదు. చూచిన మాత్రమున చంపునట్టిది. ఎవడు గృహస్థుడైనను జితేంద్రియుడై చరాచరములలో అంతట యాత్మరూపముచే నిండియుండునో వాని ఇంటిలో చిరకాలమీమె యుండగలదు. ఇందుకు సంశయములేదు." అనిన మండోదరీ వాక్యమును విని దూతలు "అట్లే" యని వెడలునపుడు ఆ కన్యక ఇట్లనెను, "నేను రాక్షసులనందరిని చంపి, సపుత్ర సపరివారముగా రావణుని ధ్వంసము చేయుటకు లంకకు మరలవచ్చెదను. పిమ్మట మూడవతూరి వచ్చి, నికుంబజాతుని ఆపౌండ్రకుని, శతకంఠరావణుని జంపెదను. మరల నాలగవతూరి వచ్చి, కుంభకర్ణ తనయుడగు శూరుడైన మూలకాసురుని సంహరించెదను." అనిన ఆ కన్య వాక్యములను విని రావణునికి హృదయభేదనముకాగా, భయభ్రాంతులగు రాక్షసులందరును పీనుగుల వలే వెలవెలబోయిరి. రావణుడు తీక్ష్ణఖడ్గమును చేతబూని, దీనినిప్పుడే చంపవలయు నని, పద్మ వద్దకు పరుగిడెను. చంపదలచు పతిని జూచి, మండోదరి ఇట్లు నివారించెను. "ఆయువు బలముండగా ఇప్పుడే సాహసము చేయవలదు. అట్లు సాహసించితివా తప్పక ఇప్పుడే నీవు చత్తువు. ఈమెయొక్క మాట బొంకుకాదు. వెనుక నుండి యగునది యగుగాక! మొదట వనమున విడిచిపెట్టుము. కాలాంతర మున రాదగిన మృత్యువును ఇపుడేల రాగోరుదువు?" ఇట్టి ఇల్లాలి మాటను విని



దశకంఠుడు ఊరకయుండెను. అంత ఆ దూతలు ఆ పెట్టెను తీసుకునిపోయి, అనేక అరణ్యములను జూచుచు, మిథిలాదేశమందు, నాగటిచాలున గంగానది వద్ద భూమిలో పాతిపెట్టి తిరిగి లంకానగరమును చేరి, రావణునితో జరిగిన సంగతిని విన్నవించిరి. ఆ భూమి విదేహరాజుచే నొక బ్రాహ్మణునికి సూర్యగ్రహణ సమయమున సమర్పింపబడినది. (255)

**పశ్యన్ ముహూర్తం ప్రియః స ప్రత్యబ్దం వై పునః పునః ।**
**చిరకాలేన దృష్ట్వాఽథ ముహూర్తం పరమోదయమ్ ॥ 256**

**శూద్రేణ కర్షయామాస భూమిం కృష్యర్థమాదరాత్ ।**
**తదా హలశితాగ్రేణ నిర్గతా సా కరండికా ॥ 257**

**తాం గృహీత్వా స శూద్రోఽపి యయౌ భూమిపతిం ద్విజమ్ ।**
**స మత్వా తన్నిధానం తు హర్షాత్ప్రాహ ద్విజోత్తమమ్ ॥ 258**

**శ్రేష్ఠస్తవ ముహూర్తోఽయం మహాభాగ్యం తవ ద్విజ ।**
**ఇమాం హలాగ్రసంభూతాం గృహాణ త్వం కరండికామ్ ॥ 259**

**నిధానపూరితాం గుర్వీ మయా యత్నేన వాహితామ్ ।**
**తతః స ద్విజవర్యస్తు తాం జగ్రాహ కరండికామ్॥ 260**

**తామానీయ విదేహాయ సభామధ్యే దదౌ ముదా ।**
**నృపతిం ప్రాహ వృత్తం తద్విప్రః శ్రుత్వా నృపోఽసి సః 261**

**ఉవాచ బ్రాహ్మణం భక్త్యా మయా భూమిః సమర్పితా ।**
**తస్యాం లబ్ధా త్వయా చేయం తవైవాస్తు కరండికా ॥ 262**

**విదేహనృపతేర్వాక్యం శ్రుత్వోవాచ ద్విజః పునః ।**
**మహ్యం సమర్పితా పూర్వం భూమిరేవ త్వయానృప ॥ 263**

**నేయం కరండికా రమ్యా వసుపూర్ణా సమర్పితా ।**
**యద్భూమౌ వర్తతే విత్తం తన్నృపస్య న సంశయః 264**

**మా మామధర్మః స్పృశతు గృహాణేమాం కరండికామ్ ।**
**ఏవం నృపస్య విప్రేణ కలహోఽభూత్సుదారుణః ॥ 265**

ఆ ద్విజుడు దానిని దున్నించుటకై ప్రతి సంవత్సరమును సుముహూర్తమున ప్రతీక్షించుచుండి చిరకాలమునకు లభించిన ఒక దివ్యముహూర్తమున తన భూమిని రైతుచే దున్నించెను. అప్పుడు ఆ నాగలి మొన తగిలి ఆ పెట్టె వెలువడెను. ఆ

శూద్రుడు దానిని తీసుకుని భూస్వామి వద్దకు వచ్చి, సంతోషముగా ఆ బ్రాహ్మణునితో, "స్వాములారా! మీరు మహాపుణ్యాత్ములు. పెట్టిన ముహూర్తము చాలా బాగుగానున్నది. ఇది నాగలి మొనతగిలి వెలువడిన పెట్టె. తీసికొనుడు, ప్రయత్నముతో తెచ్చితిని," అని చెప్పెను. పిదప ఆ బ్రాహ్మణుడు ఆ కరండికను తీసుకుని రాజసభకు సమర్పించి, దాని వృత్తాంతమును రాజుతో చెప్పెను. అందుకు రాజు, (260) "నేను నీకు భూమిని దానముచేసితిని, దానిలో నిది దొరికెను, ఈ పెట్టెను నీవే తీసికొమ్ము, ఇది నాకేల?" అని నిరాకరించెను. బ్రాహ్మణుడను, "రాజా! నాకు ముందు భూమినిమాత్రము నీవు సమర్పించితివి, ఈ సువర్ణపూర్ణమగు దివ్యకరండికను నాకివ్వలేదు. భూమిలో దాగియుండి లభించిన విత్తము రాజుకు చేరతగినది. ఇది ధర్మము. ఇందులో సంశయము లేదు. నాకు అధర్మపు సొమ్ము వద్దు. ఈ పెట్టెను తీసికొమ్ము" అని వేడెను. ఇట్లు వారిరువురును వివాదము చేయునపుడు సభాసదులందరును, "మహారాజా! ఏల ఈ వ్యర్థప్రసంగము? వలదు వలదు, దానిలో నేమియున్నది చూడుము," అని పలికిరి. దూతలచే దానిని తెరిపించి, అందులోని బాలికను చూచి విస్మయము నొందెను. బ్రాహ్మణుడు ఆ పెట్టెను రాజసభలో సమర్పించి తన ఇంటికి వెడలెను. (265)

వివిధ తత్త్వ బోధకులు, ధర్మబోధకులు అల్పమైన యీ 'అహం' అనగా నేను అను భావము వ్యక్తులలోను, సంఘములోను, జాతులలోను కూడ స్వార్థపరత్వము, అజ్ఞానము, బాధ, దుఃఖము అన్నింటికిని మూలకారణమని చెప్పుదురు. అసలు అల్పమైన యీ చిన్న 'అహం' ఎచ్చటనున్నది? ఆ సిద్ధాంతములే నిర్వికారమును, కోటి సూర్య ప్రభాభాసమగు సత్యమొకటి కలదనియు, అది తప్ప వేరేదియు లేదనియు చెప్పుచున్నవి. సూర్యుని వంటి జ్ఞానము ఉదయించిన వెనుక అల్పమైన 'అహం' తో బాటు సర్వము అంతర్ధానమగుచున్నది. లోపల, వెలుపల, పైన క్రింద, చుట్టును మహత్తరమగు తేజస్సు తప్ప వేరేమియు లేని ఏకమై, అద్వితీయమై వెలుగు జ్యోతికి ప్రణామములు. **–స్వామి ఓంకార్**

కాలము ప్రతిక్షణము విలువైనదిగాన, స్వార్థమునకు స్వస్తి చెప్పి మీ తమస్సు నుండి మేల్కొనుటకు ఈ ప్రస్తుత క్షణమే ఉత్తమమైనది. తమ కొరకే సదా జీవించుచు అధోగతి పాలుగుట కంటె, స్వార్థ రహితమైన, జీవితముతో ఇతరుల సేవ చేయుచు అభివృద్ధి చెందెడి జీవితమునకు ఈ ప్రస్తుత పవిత్ర క్షణమునకు స్వాగతమిమ్ము. **–స్వామి ఓంకార్**



# గురువాచక కోవై

**మూలం : మురుగనార్** **వివరణ : సాయికృష్ణ**

**(గత సంచిక తరువాయి)**

## ఆత్మప్రకాశము

**స్వతంత్రమైన తత్త్వముగా తనను తాను భావించుకొనెడి 'నేను' వంచించెడి స్వభావముగల మిథ్యారూపము. తన మూలమైన హృదయమును, విచారణ ద్వారా తెలిసికొన్నప్పుడు మాత్రమే ఈ 'నేను' నశించును. ఈ మిథ్య 'నేను' నశించినప్పుడు మాత్రమే, ఆద్యము, ఏకము అయిన సద్వస్తువు ఉజ్వల దీప్తితో ఉప్పొంగును.**

నిజానికి నేను శరీరమును అని భావించెడి అహంకారమునకు స్వతంత్ర మయిన ఉనికి లేదు. అది ఆత్మనుండే పుట్టినది. ఆత్మ నుండి వచ్చిన 'నేను' అనే ఆలోచనే అహంత. నిజానికి ఆత్మకు ఆది, తుదిలేదు. మొట్టమొదట ఆత్మ మాత్రమే ఉన్నది. స్వతంత్రమయిన ఉనికి ఉన్నది ఆత్మ మాత్రమే. అహంకారం అజ్ఞానంతో శరీరముతో తాదాత్మ్యం చెంది, అంతా నేనే చేస్తున్నాను అని, ఏదయినా చేయగలను అనే స్వభావం కలిగి తనను తాను వంచించుకుంటూ ఉంటుంది. సుఖదుఃఖాలను అనుభవిస్తూ ఉంటుంది. గురువు ద్వారా బోధ చేయబడినప్పుడు, ఈ అహంకారము తన మూలాన్ని వెదకడానికి ప్రయత్నము చేస్తే (తన మూలమయిన హృదయాన్ని) నేను ఎవరిని అనే విచారణ ద్వారా ఈ మిథ్యా నేను నశిస్తుంది. మొట్టమొదట ఉన్న (ఆద్యము) రెండవది అనేది లేని ఒక్కటే. అయిన, ఉండడమే (ఉనికి) స్వభావముగా కలిగినది ఆత్మ. నేను నశించినపుడు మాత్రమే అద్భుతమయిన కాంతితో ఆత్మ ప్రకాశించును. (అనుభవమునకు వచ్చును.)

**అహంతకు స్వతసిద్ధమయిన (వాస్తవమైన) ఉనికి లేదు. అది ప్రమాదము (ఆత్మను మఱచుట) అనెడి గాఢ తమస్సులో పొడసూపి, దృశ్యమాన జగత్తుగా, విశృంఖలముగా, వికృతముగా గంతులు వేయును. ఒక సజ్జనుడు, అతనిని గురించి విచారణ చేయువరకు అందరి యెదుట స్పష్టముగా గోచరించును. విచారణ చేసిన మరుక్షణమే కాలికి బుద్ధి చెప్పి, ఎక్కడికో అదృశ్యమై పోయినట్లుగా, 'ఈ అహంత ఎవరు?' అని హృదయములో విచారణ చేసినచో, అహంత అదృశ్యమై, అహంత వెనుకనున్న సద్వస్తువు–ఆత్మరవి–హృదయాకాశములో ప్రకాశించును; అజ్ఞానాంధ కారము నశించును.**

అహంతకు స్వతసిద్ధమయిన ఉనికి లేదు. స్థిరమయిన ఉనికి లేదు. మార్పులు చెందుతూ ఉంటుంది. మనము నిద్రలేవగానే జాగ్రదవస్థలో ఉంటుంది. స్వప్నములలో వ్యవహారం చేస్తుంది. గాఢనిద్రలో ఎక్కడికి పోతుందో తెలియదు.

దీని ఉనికి వస్తూ పోతూ ఉంటుంది. ప్రమాదము అంటే అజాగ్రత్త అని అర్థము. అది అజాగ్రత్తల్లో అజ్ఞానంతో మునిగి, గాఢతమస్సులో ఆత్మను మరచింది. అహంకారం అంటే తలపుల రూపమే. ప్రపంచము మొత్తములోని అన్ని జీవ రాశుల సంకల్పముల రూపమే. ఈ జగత్తుగా ఏర్పడినది. ఈ అహంకారము దీనిలోని బాగోగులను గురించి వికృతంగా గంతులు వేస్తూ ఉంటుంది. ఒక సత్తుని గురించి ఆలోచించేవాడు (సజ్జనుడు) పరమాత్మను గురించి ఆలోచించేవాడు, గురుబోధ వలన ఈ ప్రపంచము అదృశ్యమయిపోతుంది. అప్పుడు ఈ అహంత వెనకాల ఉన్న సద్వస్తువు ప్రకాశిస్తుంది.

**సాధనలో అడ్డంకులు:-** మనస్సు అనేక కల్పనలు (ఆలోచనలు) చేస్తూ భయపెడుతూ ఉంటుంది. ఎన్నో సందేహాలను లేవనెత్తుతూ ఉంటుంది. ప్రాపంచిక వ్యవహారాలతో తాపత్రయపడుతూ తల్లడిల్లిపోతుంది. ఇవన్నీ మనస్సు యొక్క చేష్టలే. సాధకునికి, గురువు బోధచేసినా, ఆ బోధ అర్థమయినా కూడ ఎన్నో సంశయాలు వస్తాయి. ఇవన్నీ సహజమే. ఇవన్నీ ఓర్చుకుంటూ సాధనచేస్తే చివరకు అన్నీ సరి అయిన స్థితికి వస్తాయి. చక్కబడతాయి. జడశరీరానికి ఆత్మకు మధ్యన ఉన్నదే అహంకారము. చీకటిలో నల్లని మొద్దును చూసి పిశాచమని భయపడతాము. దగ్గరగా వెళ్ళి (విచారణ చేసిన) చూచిన అది మొద్దు అని తెలియును. సాధనలో విసుగు, భయము, సంశయాలు అన్నీ కూడ మనస్సు కల్పించుకున్నవే. నిజానికి అటువంటివేవీలేవు. ఇటువంటివి కలిగినప్పుడు ఓర్పుతో ఉండి, బాగా విచారణ చేయాలి. "భయపడేది అహంకారము. నేను ఆత్మను, నాకు నాశనము లేదు. భయము కలుగదు." అని విచారణచేస్తే, అ అనిశ్చిత పరిస్థితి తొలగిపోతుంది. మన అహంకారమే అన్ని ఊహలు చేస్తుంది. కాబట్టి, అసలు అహంకారం లేకుండా చేసుకోవాలి. అహంకారమే, అహంకారమును గురించి 'నేనెవరినని' విచారణ చేస్తే అహంకారం నశిస్తుంది. విచారణ చేయనంతవరకు అహంకారం ఉనికిని కలిగి మనల్ని బాధిస్తూ ఉంటుంది. జ్ఞానము, వైరాగ్యము దృఢముగా ఉండుట చేత సాధనలో మనస్సు నశిస్తుంది.

**అహంత మౌనాకాశమును చేరి, నశించినప్పుడు జ్ఞానాకాశముగా ప్రకాశించును. అందుచేత మిథ్యాహంత తన మూలమును చేరి, మిథ్యాస్వప్నము వలె నశించిపోగా, అసలు 'నేను' తనకు తానుగా ప్రకాశించును.**

ఎప్పుడయితే విచారణ చేస్తామో అప్పుడు ఈ అహంకారము నశించిపోయి, తన మూలమును చేరి, స్వప్నమువలె నశించిపోవును. అప్పుడు ఆత్మ తనకు తానుగా ప్రకాశించును.



**జడమైన దేహమే శిలువ. దేహాహంభావమే క్రీస్తు. అహంతను శిలువ వేసినప్పుడు, మేకులు లోనికి దిగి వేదన ననుభవించుచు మరణ బాధతో అది ప్రాణములు వదలును. అప్పుడు మిగిలి యుండెడిది ఆత్మ. అది శాశ్వతముగా నెలకొని యుండెడి బ్రహ్మము. జనన మరణ దుఃఖాతీతము, భగవతత్త్వ ప్రకాశము, ఆత్మ సాక్షాత్కారము. ఇదే క్రీస్తుయొక్క పునరుత్థానము, విముక్తి.**

అహంకారమును శిలువతో పోలుస్తున్నారు భగవాన్. మన శరీరము శిలువ. క్రీస్తు శరీరమును ఎట్లయితే శిలువకు వేసి మేలుకు కొట్టారో అటులనే మన అహంకారాన్ని కూడ బాగా మేకులు వేసి కొట్టాలి. ఎటువంటి పరిస్థితులలో నయినా దేహభావన పోవాలి. ఎంత కష్టమయినా ఓర్చుకుని అహంకారాన్ని నశింపచేయమని ఉపనిషత్తు చెబుతుంది. దేహాత్మ భావన వదులుకోవాలి. అప్పుడు ఆత్మవిచారణ అనే శిలువకు అహంకారాన్ని వెయ్యాలి. ఎంత కష్టమయినా, ఏదో విధాన ప్రయత్నం చేసి అహంకారాన్ని పోగొట్టుకుంటే, దివ్యమయినటువంటి భగవతత్త్వ ప్రకాశము నీకు అనుభవానికి వస్తుంది. అదియే క్రీస్తు తిరిగి ప్రాణముతో తిరిగి రావడము. ఆత్మానుభవము కలగడమే క్రీస్తు తిరిగి రావడము. ఆటంకాలను, ఎదుర్కొవడమే వేదననుభవించుట, బంగారమునకు పుటము పెట్టినపుడు మిక్కిలి ప్రకాశించును. కాళీమాత దర్శనము కోసము రామకృష్ణ పరమహంస, మలయాళ స్వామి ఆత్మ సాక్షాత్కారాన్ని తమ పట్టుదలతో పొందారు. అహం ఎక్కడ పుడుతుందో గమనించి లయం చేసినవాడే నిజమైన మునీంద్రుడు. తన మూల బ్రహ్మమును చేరి హాయిగా శాంతిని పొందువాడే మునీంద్రుడు.

**(జీవునిగా) అపార మౌనముతో మరణించుట, అంతట (ఆత్మగా) అద్వైత బ్రహ్మరూపమగు అపార మౌనములో పునరుత్థానము చెందుట-ఇదే కైవల్యము. జ్ఞానస్థితిలో ప్రకటమగు బ్రహ్మానందము స్వస్వరూపమయి శాశ్వతముగా విరాజిల్లును.**

ఎప్పుడయితే ఆత్మానుభవము కలుగుతుందో అప్పుడు అంతటా ఆత్మే గోచరిస్తుంది. రెండవది ఏమీ తోచదు. రూపనామాలు పోతాయి. అవి బ్రహ్మముగానే అనుభవానికి వస్తాయి. అదియే కైవల్యస్థితి.

**హరిః ఓం తత్సత్**

మాయా ప్రభావముచే మూడు రోజుల ముచ్చటకు, అశాశ్వతమైన నీటిబుడగ వంటి నామరూపముల వెంట పరిగెత్తుచు, శాశ్వతమైన, నిత్యమైన నీ ఆత్మయై యున్న దైవమును మరచి మోసపోకుడు. లెండు! లెండు! మేల్కొనుటకు యిదియే సమయము. నేడే ఉత్తమమైనది. **-స్వామి ఓంకార్**

## దక్షిణామూర్తి స్తోత్రం

# మానసోల్లాసం -9

**(డిశంబరు సంచిక తరువాయి)** **వాఖ్యాత - వింజమూరి రాధాకృష్ణ**

భారతీయ తత్త్వ విచారణలో ఆదిశంకరుల రచనలు అద్వితీయం. ఈ రచనా వనంలో శంకరులు దక్షిణామూర్తి స్తోత్రంలో కేవలం 10 శ్లోకాలలోనే వారి అద్వైత భావాలను చక్కగా పొందుపరిచారు. వారి ప్రథమ శిష్యులైన శ్రీ సూరేశ్వరాచార్యులు సాధకుల సౌలభ్యం కొరకు, ఈ భావాలను తేలికగా అర్థంచేసుకొనుటకు వీలుగా 300 శ్లోకాలలో మానసోల్లాసం పేర వార్తిక వ్రాశారు. 2024 మే నెల నుండి శాంతి పత్రికలో ఈ మానసోల్లాసం టీకా, తాత్పర్యము, వ్యాఖ్యానము మనం ధారావాహికంగా చదువుతున్నాము. ఈ 2025 నూతన సంవత్సరంలో కూడా ఈ జ్ఞానయజ్ఞం గురుదేవులు శ్రీ స్వామిఓంకార్ ఆశీస్సులతో కొనసాగిద్దాము.

2024 సంవత్సరం డిసెంబర్ నెల శాంతి పత్రికలో దక్షిణామూర్తి స్తోత్రంలోని రెండవ శ్లోకము, వాని టీకా తాత్పర్యము ప్రచురింపబడినది. ఈ రెండవ శ్లోకానికి సూరేశ్వరాచార్యులు తమ మానసోల్లాసంలో 56 శ్లోకాలలో వార్తిక వ్రాసిరి. వీని పరిశీలన కొనసాగిద్దాము. శంకరులు తమ మొదటి శ్లోకంలో మనం చూచే ఈ విశ్వం, మాండూక్య ఉపనిషత్‌లో చెప్పినట్లు, కేవలం విశ్వానరుడుగా జీవుడు పొందుతున్న భ్రమ అనుభవం మాత్రమే అని అద్వైత కోణంలో చెప్పారు. సృష్టి రహస్యాన్ని ఉపనిషత్తులు సమగ్రంగా వివరించాయి. మనం ప్రస్తుతం చూసే వివిధ ప్రాదేశిక, కాలభేదములు కల. ఈ సృష్టి అంతా మొట్టమొదట ఎట్టి భేదములు లేని కేవలం ఒకే ఒక్కటిగా మాత్రమే ఉన్నది. అందుకే శంకరులు ప్రాఙ్నిర్వికల్పం అన్నారు. మరి ఇప్పుడు మనం చూస్తున్న విశ్వం ఇలా వికల్పం ఎందుకు ఎలా చెందింది? ఈ విషయంలో ఉపనిషత్తులు ఏం చెప్తున్నాయి అనేది గమనించవలసి ఉన్నది.

ఋగ్వేదాంతర్గత ఐతరేయ ఉపనిషత్ 1-1 మంత్రంలోనే ఈ అంశము తెలిపినది.

**ఓం ఆత్మవా ఇదమేక ఏవాగ్ర అసీత్ నాన్యత్కించన మిషత్.**

ఓం! ఆదిలో (ఈ సృష్టికి పూర్వం) ఒకే ఒక్క ఆత్మ మాత్రమే అంతట విస్తరించి ఉన్నది. మరి వేరుగా ఏమీ లేదు.



సామవేద అంతర్గతమైన చాందోగ్య ఉపనిషత్ 6-2-2లో కూడా ఇదే అంశాన్ని పేర్కొనడం జరిగింది.

**సత్త్వేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాఽద్వితీయమ్**

ఓ ప్రియదర్శన! మున్ముందు ఈ జగత్తు (సత్,) గా మాత్రమే ఉండెను. ఆ సత్ ఒక్కటే. రెండవది ఏదీ లేనిదిగా ఉండెను. ఆ సత్ యే తరువాత **బహుస్యాం ప్రజాయేయేత చాందోగ్యం (6-2-2)** అనేకం అగుదును గాక అనుకొనెను.

ఈ రీతిగా ఒక్కటిగా ఉన్నది అనేక భేదములతో ప్రాదేశిక కాల విభాగాలతో వికల్పమైనదిగా ఏర్పడి సృష్టిగా మారినది. శంకరులు ఈ సహజ స్థితిలో ఉన్న ఆత్మను **బీజాస్యాంత రివాంకురో జగదిదం**-అనగా విత్తనంలో దాగియున్న వేళ్ళు కాండము, కొమ్మలు, రెమ్మలు, ఆకులు, పువ్వులు, కాయలు, పండ్లుతో కూడిన అంకురముతో పోల్చిరి. మాండ్యూకోపనిషత్ ఈ స్థితినే **"సుషుప్తస్థాన ఏకీభూతహః ప్రజ్ఞాన ఘన"** (మాండూక్య 5) స్థితిగా వర్ణించినది. అనగా గాఢనిద్రలో మనము అనుభవించే తాత్కాలిక సుఖస్థితి అన్నమాట. పిదప ఒక మహామాయవి లేక మహాయోగి స్వేచ్ఛగా దేశ, కాలాలతో కూడిన విచిత్రమైన దానిగా రూపొందించెను అని ప్రస్తావించిరి. గురుమూర్తి అయిన, జ్ఞాన స్వరూపుడైన అట్టి దక్షిణామూర్తికి నమస్కారము.

**మానసోల్లాసం:** దక్షిణామూర్తి స్తోత్రములోని ఈ రెండవ శ్లోకానికి సూరేశ్వరాచార్యులు వ్రాసిన మానసోల్లస వార్తికలో మొదటి ఎనిమిది శ్లోకాలు శంకరుల అద్వైత వాదానికి పూర్వ పక్షము చేసిన ఇతర దార్శనికుల వాదనను వివరించిరి. పిదప తొమ్మిదవ శ్లోకం నుండి ఖండించిరి.

**వైశేషిక మతము :** కణాద కశ్యప మహర్షి ప్రతిపాదన ఇట్లు తెలుపబడినది.

**1. ఉపాదానం ప్రపంచస్య సంయుక్తాః పరిమాణవ**
**మృదన్వితో ఘటస్తస్మాద్భాసతేనేశ్వరాన్వితః**

సంయుక్తా=చేరియున్న, పరిమాణవః =పరమాణువులు, ప్రపంచస్య=జగత్తుకు, ఉపాదానం=ఉపాదాన కారణము, తస్మాత్=అందువలన ఘటః=కుండ, మృదన్వితః= మట్టితో కూడినదై, భాసతే=కనిపించుచున్నది. ఈశ్వరాన్వితః= ఈశ్వరుడుతో కూడినదిగా, నభాసతే=కనిపించుటలేదు.

జగత్తుకు ఉపాదాన కారణం ఒకే చోట కలసి కూడియున్న పరమాణువులే.

అందుచేతనే కుండ మట్టి యొక్క కణములతో కూడినదిగా కనిపించుచున్నదే గాని ఈశ్వరునితో కూడినదిగా కనిపించుటలేదు. కుండ నుండి కుండపుట్టదు. అనేక మట్టికణాలు కలసి కుండ అయినది. వీరి వాదననుసరించి ఈ విశ్వం, భూమి, నీరు, మున్నగువాని పరమాణువుల కలయికచే ఏర్పడినది. ఇందుకు ఈశ్వరుని ప్రమేయము అసవరము లేదు.

**2. పరమాణుగతా ఏవ గుణా రూపరసాదయః**
**కార్యే సమాన జాతీయ మారంభతే గుణాంతరమ్**

రూపరసాదయః= రూపము రసము మున్నగు, గుణాః=గుణములు, పరమాణు గతాః ఏవ= కారణమగు పరమాణువులయందే ఉంటూ కూడా, సమాన జాతీయం-సమాన జాతీయమగు, గుణాంతరం=వేరే గుణములను, కార్యే= కార్య ప్రపంచమందు, ఆరంభంతే=ఆరంభించుచున్నవి.

రూప రసాది గుణములు ఏది కారణ రూపమగునో ఆ పరమాణువుల యందే ఉంటూ కూడా కార్యరూపమైన ప్రపంచమందు సమాన జాతీయమైన ఇతర గుణము లను ఆరంభించుచున్నవి. ఇచ్చట కూడా ఈశ్వరుని జోక్యం అవసరము లేదు.

**3. కార్యం యత్ర సమన్వేతి కారణం సమవాయితత్**
**చక్రాద్యం సాధనం యత్తు ఘటస్యాసమవాయితత్**

యత్ర=దేనియందు, కారణం=కారణము (ఉత్పత్తికి మూలమైన ముడి పదార్థము) కార్యం=కార్యమును, (ముడి పదార్థము చే ఉత్పత్తి చేయబడిన వస్తువు) సమన్వేతి =కలిసియుండునో, తత్=ఆ కారణము లేక మూల వస్తువు, సమవాయిగా పిలువ బడును. ఘటస్థ=కుండకు, సాధనం=ఒకసాధనంగా ఉపయోగపడినది. చక్రాద్యం =చక్రము మున్నగు పరికరములు, ఆసమవాయి=సమవాయి కాదు అనగా వస్తువుకు భిన్నమైనది.

ఉత్పత్తికి మూలమైన పదార్థము అనగా మట్టి సమవాయి కారణము. అందుకు సహాయపడినది కావున చక్రము అసమవాయి కారణము.

**4. సమావాయిని దుష్టేద్యత్స సమవయ్యాశ్రయే తథా**
**కార్యే ఉ_వధృత సామర్థ్యం కల్ప్యతేఉ_సమవాయితత్**

యత్=ఏది, కార్యే=వస్తువు తయారగు కార్యముందు, అవధృత సామర్థ్యం=తన సమర్థతతో ఒక వస్తువు ఉత్పతికి అవసరమై, సమవాయిని =సమవాయి కారణముచే,



తథా=అట్లే, లేదా, సమవయ్యాశ్రయే=సమవాయముతో కలిసియుండక ఆశ్రయించి ఉండునో అది అసమవాయి కారణము కల్ప్యతే = అగును.

ఉదాహరణకు ఒక కుండ ఉత్పత్తి చేయుటకు బంక మట్టి అవసరము. బంక మట్టి కుండకు సమవాయి కారణము. ఎందుకంటే కుండ చేయుటకు ముందు ఉన్న మట్టి, కుండ తయారయ్యాక కూడా కుండలోని కుండను ఆశ్రయించి పరిణామం చెందిన రూపంలో ఉండును. కానీ ఆ కుండ చేయుటకు సహాయముగా ఉపయోగించిన చక్రము కుండలోగాని, కుండతోగాని యుండదు. దానికి ఇక కుండతో ఎట్టి బంధము లేదు అందుచే అది అసమవాయి కారణము.

**5. నిమిత్తం కారణం తేషామీశ్వరశ్చ కులాలవత్**
**యత్కార్యం జాయతేయస్మాత్తస్మిన్ తత్ ప్రతితిష్ఠత**

తేషాం=ఈ జగత్తులోని అన్ని వస్తువులు, నిమిత్తకారణం=నిమిత్త కారణము, కులాలవత్=కుండకు కుమ్మరివలె, ఈశ్వరః=ఈశ్వరుడు, యస్మాత్=ఏ కారణము నుండి, యత్=ఏ, కార్యం=కార్యము, జాయతే=పుట్టునో, తస్మిన్=ఆకారణమందు, తత్=ఆ కార్యము, ప్రతితిష్టతి=ఆవరించియుండును.

ఈశ్వరుడు కుండలు చేయు కుమ్మరి వానివలె వస్తువులకు ఏది మూల కారణమో అది తయారైన వస్తువులో ఆవరించి ఉండునట్లు చూచును. అనగా మట్టితో తయారైన కుండలో మట్టి కుండ అంతా ఆవరించి ఉన్నట్లు చూచును.

### అనేక కోణాలు

గాయమైన మనసును
మరింత గాయం చేసినా...
ముక్కలైన హృదయాన్ని...
మరింత ముక్కలు చేసినా
బ్రద్దలయిన గుండెను...
మరింత బ్రద్దలు కొట్టినా..
నిరాశలు.... ఆవరిస్తాయి
చివరకు
సమయం కరిగిపోతుంది
కర్తవ్యం బోధపడదు.
భవిష్యత్ అర్థం కాదు
చివరకు నిస్పృహలు మొదలువుతాయి!
చివరకు వాటికి బానిసైపోతాం !
అందుకు జీవితాన్ని
ఒక కోణం నుంచి కాకుండా
అనేక కోణాల నుంచి పరిశీలించు.
గాయాలకు పరిష్కారం
దొరుతుంది.

**మలిశెట్టి శ్రీనువాస రంగారావు**
**(బన్ను)**

# ఓం నమో నారాయణాయ

**విషయము : సుఖము / ఆనందం / శాంతి** **చైతన్య శ్రీశాంతి ఆశ్రమము**

నేను సుఖం పొందాలి అనుకుంటున్నాను. సుఖం విషయ వస్తువుల్లో ఉంది అని భావించి ఆ విషయాన్ని పొందితే సుఖం లభిస్తుందని, పొందకపోతే దుఃఖం లభిస్తుందని భావిస్తున్నాను. "అనుకూలం వేదనీయం సుఖం," "ప్రతికూలం వేదనీయం దుఃఖం" అని భావిస్తున్నాను. భగవాన్ శ్రీ ఆదిశంకరులవారు ఈ వివేకం పశువులకు కూడా ఉంది అన్నారు. "యథా దండోద్యతకరం పురుషం అభిముఖం ఉపలభ్య మాం హంతుం ఆయం ఇచ్ఛతి ఇతి పలాయితుం ఆరభంతే," వ్యక్తి చేతిలో కర్రను చూసినపుడు పశువు పారిపోతుంది. **"హరిత తృణపూర్ణ పాణిం ఉపలభ్య తం ప్రతి అభిముఖీ భవంతి"** వ్యక్తి చేతిలో గ్రాసం చూసిన పశువు వ్యక్తి వైపుకు వెలుతుంది. అనుకూలంగా ఉంటే సుఖం ప్రతికూలంగా ఉంటే దుఃఖం అనేటటువంటి వివేకం పశువులకు కూడా ఉంది. విషయాలలో సుఖం చూసినంత వరకు పశువుకు నాకు తేడా లేదు, సుఖం విషయాలలో లేదు, సుఖం నాకంటే వేరుగా లేదు. నేనే సుఖస్వరూపం, శాంతిస్వరూపం, ఆనందస్వరూపం అయి ఉన్నాను. నేను ఎలా ఆనందస్వరూపం అవుతాను? ఉదా:సుషుప్తిలో విషయాలేవీ లేనప్పుడు నేను ఆనందంగా ఉన్నానా లేదా? ఉన్నాను. మెలకువ రాగానే నేను ఆనందాన్ని అనుభవించాను అని తెలుస్తుంది. అనగా విషయాలు ఏమీ లేనప్పుడు కూడా ఆనందంగా ఉన్నాను. అంటే ఆ ఆనందం నాకంటే వేరుగా లేదు. నేనే అయి ఉన్నాను. నేనే ఆనంద స్వరూపం అని తెలియక అజ్ఞానంతో ఈ దేహ ఇంద్రియ మనోబుద్ధులు నేనుగా భావించి వాటి సుఖదుఃఖాలను నా సుఖదుఃఖాలుగా భావిస్తున్నాను. దీనినే అతస్మిన్ స్తద్బుద్ధిః (అధ్యాస) అన్నారు భగవాన్ శ్రీ ఆదిశంకరులవారు. అజ్ఞానం ద్వారా అధ్యాస ఏర్పడుతుంది. అజ్ఞానాన్ని తొలగిస్తే అధ్యాస కూడా తొలగిపోతుంది. నేను ఆనంద స్వరూపం అనే జ్ఞానం ద్వారా ఈ అజ్ఞానం అధ్యాస రెండూ కూడా తొలగి పోతాయి. అందువలన ఆత్మజ్ఞానాన్ని పొందడానికి నేను ప్రయత్నం చేయాలి. ఎప్పుడు చేయాలి అనేటువంటి సందేహం కలిగినట్లయితే శాంతి ప్రార్థనలో పూజ్యశ్రీ ఓంకార్ స్వామీజీ తెలియజేసినట్లుగా ఇప్పుడే ఇక్కడే ముక్తి పొందడానికి ఎందుకు ఇప్పుడే ఈ జన్మలోనే ప్రయత్నం చేయాలి. తరువాత జన్మలో అయినా ముక్తి పొందవచ్చు కదా! ఇప్పుడు బాహ్యసుఖాలను అనుభవించి తరువాత జన్మలో ముక్తి కోసం ప్రయత్నం చేస్తాను అని నేను భావించినపుడు శృతిమాత చెబుతోంది. "ఇహ చేదవేదీ దథసత్యమస్తి



నచేదిహావేదీత్ మహతీ వినష్టిః" ఈ జన్మలో ముక్తి పొందలేరు అంటే ఇంకేజన్మలోనూ ముక్తి పొందలేదు అనే ఈ శృతి వాక్యాన్ని మనం రెండు రకాలుగా అర్థం చేసుకోవచ్చు. 1. ఉదాహరణకు మన ఇంటికి ఎవరైనా అతిథులు వచ్చారనుకోండి. వారికి మనం ఆతిథ్యం ఇవ్వలేదు అంటే మళ్ళీ వస్తారా? రారు. అలాగే భగవాన్ శ్రీ ఆదిశంకరులవారు చెప్పినట్లుగా మనుష్యత్వం, ముముక్షుత్వం, మహాపురుష సంశ్రయం లభించడం అత్యంత దుర్లభం. అతిథులతో సమానం. దైవానుగ్రహం వలన ఈ మూడూ లభించినపుడు నేను వినియోగించుకోకపోతే మరల లభించవు. కాబట్టి ఈ జన్మలోనే నేను ముక్తిని పొందగలగాలి.

2. మరోవిధంగా విచారణ చేస్తే ఈ దేహన్ని వదలిపెట్టిన తరువాత నేను ఇంకొక దేహన్ని స్వీకరిస్తాను. మోక్షం పొందాలి అంటే నేను ఆధ్యాత్మిక వాతావరణం కలిగి ఉన్న ప్రదేశంలో, ఆధ్యాత్మికత ఉన్నటువంటి తల్లిదండ్రులకు లేదా అటువంటి కుటుంబంలో జన్మించాలి. కానీ నేను ఇంకో జన్మ స్వీకరించేటప్పటికి నాకు అటువంటి కుటుంబం కానీ అటువంటి వాతావరణం కానీ లభించడానికి అవకాశం లేదు. ఎందుకనగా ప్రస్తుత సమాజంలో ప్రతీ ఒక్కరు సినిమాలకు, సెల్‌ఫోన్‌లకు, టీ.వీలకు, కంప్యూటర్లకు అంకితమైపోతున్నారు. నేను ఒకవేళ ఈ జన్మలో మోక్షం పొందకుండా మరొక జన్మను స్వీకరించాలని తల్లి గర్భంలోకి ప్రవేశించాననుకోండి, నేను గర్భంలో ఉండగా ఆ తల్లి సినిమాలు చూడడం వలన ఇతరులతో ఎప్పుడూ తగాదాలు పెట్టుకోవడం లేదా ఇతర భోగాలను అనుభవించాలనేటువంటి సంస్కారాలు నాలో పెంపొందుతాయి, లేదా నేను గర్భంలో ఉండగా తల్లి క్రికెట్ చూడడం వలన నాలో ఆ సంస్కారాలు పెంపొంది నేను క్రికెటర్ అవ్వాలి అను కుంటాను. ఈ సంస్కారాలన్నీ నాలో పెంపొందినపుడు మోక్షం పొందాలనే ఆలోచన కూడా నాకు కలుగదు. కావున మనుష్యత్వం, ముముక్షుత్వం, మహపురుష సంశ్రయం లభించినపుడు వాటిని ఉపయోగించుకొని మోక్షాన్ని పొందడం ఉత్తమం.

**హరిః ఓం**

మానవుడొక పూస. ఆ పూసలసంఖ్యాకములు. కాని పూసలన్నిటిని దండగ గ్రుచ్చు సూత్రము మాత్రము ఒకటియే. ఆద్యంతములు, పరిమిత ప్రమాణులగు జీవులు అపరిమితుడగు సూత్రాత్మయందు దండగా గూర్చబడిరి. "సూత్రేమణి గణాఇవ" పూసలయందు నీవు మగ్నము గావద్దు. ఈ పూసలకు ఆధారమగు దారమును గూడ జ్ఞప్తి యందుంచుకొనుము. నీ దృష్టిని సూత్రమునందు నిలుపుము.

**–స్వామి ఓంకార్**

## "ఒక్కసారి రారండి"

గీతం:రచన: కాటమరెడ్డి, M.A. M.Ed.

శాంతి ఆశ్రమం, కాకినాడజిల్లా

**ఒక్కసారి రారండి మీరు శాంతిఆశ్రమానికి**
**తోటపల్లికొండలలో ఓంకారస్వామి కృషి**
**అందరొచ్చి ఆనందం శాంతి పొందివెళ్ళండి ॥ఒక్క॥**

1. గోదావరి తీరంలో వెలసిన పుణ్యధామమండి
శాంతిని ఊపిరిగా పీల్చే స్వర్గమిదేనండి
సాధకులకు సన్యాసులకు ఆశ్రయం ఇచ్చటే
బాలబాలికల విద్యాసౌరభాలు ఇచ్చటనేనండి
వృద్ధులకు ఇదియే స్వర్గధామమండి ॥ఒక్క॥

2. ఓంకారస్వామి తపస్సు చేసిన స్థలమండి
ఎందరో స్వాములకు పుట్టినిల్లు ఇదేనండి
పూజలు వ్రతాలు సత్సంగముల సందడి
మౌనదీక్ష, శాంతి దీక్ష, ధ్యానముల స్థలమండి
మోక్షం, ముక్తి పొందే స్వర్గమిదేనండి ॥ఒక్క॥

3. గోశాల, ఆసుపత్రి, పాఠశాల యాగశాల,
దేవతలు మెచ్చిన ప్రశాంతి నిలయమండి
పునర్జన్మ సుకృతము ఇక్కడుండే అవకాశము
ఆక్సిజను, ఆహారం ఔషధంగా పనిచేస్తాయి
జ్ఞానేశ్వరిమాతాజీ ఆశీశ్శులు మెండుగా ఆధ్యాత్మిక మోక్షమండి ॥ఒక్క॥

నాలోనుండి వ్రాయుచున్నది దైవమే. మీలోనుండి చదువుచున్నవాడు దైవమే. దైవము లేకుండ ఆయన శక్తి, ఆజ్ఞలేకుండా గడ్డిపరకయైనను కదలజాలదు కదా! దుర్లభమైన మానవజీవితములు, దైవపరితాపముతో నిండి దీపము వుండగానే, ప్రాణము పోకముందే గమ్యస్థానము చేరుదురు గాక! **–స్వామి ఓంకార్**

**దైవసాయుజ్యం** : తేది. **07-12-2024 (శనివారము) శ్రీమతి కొండా పార్వతి గారు,** బెంగుళూరులో వారి పెద్దబ్బాయిగారింట్లో పరమపదించారు. వీరు 20సం॥లు పాటు ఆశ్రమంలో వుండి, వంటశాలలో నిర్వహణలో నిస్వార్థ సేవలనందించారు. కొంతకాలం ఆశ్రమ కమిటీ మెంబరుగా కూడా ఉన్నారు. స్వామి ఓంకార్ వారి ఆశీస్సులతో వారి కుటుంబ సభ్యులకు ఉపశమనం కలిగిస్తారని ఆశిస్తున్నాము.



## దైవసాయుజ్యం

**తేది. 26-11-2024 (మంగళవారం):** శ్రీ నూలు సత్యనారాయణగారు కాకినాడలో పరమపదించారు. వీరు సుమారు 25 సంవత్సరముల నుండి మాతృ ఆశ్రమ సేవలో వున్నారు. ఆశ్రమ సందర్శకులకు ఒక గైడులా వుండేవారు. ఆశ్రమ వాసులందరికి స్నేహితుడుగా వున్నారు. హాస్టలు వార్డెన్‌గా పిల్లలను తమ సొంత మనవలుగా చూస్తూ వారి యోగక్షేమాలను చూచేవారు. రిసెప్షన్‌లో కూడా వుండి అవసరానికి తమ సహాయం అందించేవారు. ఆశ్రమమునకు సంబంధించిన అన్ని విధులలోను తమ వంతు సేవను సమర్థవంతంగా నిర్వహించారు. ఆశ్రమానికి వచ్చిన వారితో ఆదరంగా అప్యాయంగా వ్యవహరించేవారు. వారు ఒక కర్మయోగిలా ఆశ్రమంలో తమ జీవనాన్ని సాగించారు. వారి కుటుంబానికి ఆశ్రమవాసులు అధిష్ఠానం ప్రగాఢ సానుభూతిని అందిస్తున్నారు. వారి ఆత్మశాంతికి ఆశ్రమంలో మృత్యుంజయ మంత్రజపం, శాంతిప్రార్థన చేయబడింది. స్వామి ఓంకార్ వారి కుటుంబ సభ్యులకు ఉపశమనం కలిగిస్తారని ఆశిస్తున్నాము.

కేవలం, ఆధ్యాత్మిక సమన్వయం అనే ఆదర్శాన్ని ప్రబోధించడానికి ఒక్కదానికోసం మాత్రమే, ఆయన అన్ని మతసాధనలనూ ఆచరించి చూశారని నేను అనుకోను. ఎప్పుడు చూసినా ఆయన తన సహజమయిన దివ్య ఆనంద పారవశ్య స్థితిలో ఓలలాడుతూనే ఉండేవారు. క్రైస్తవులు, మహమ్మదీయులు, వైష్ణవులు, ఇతర మతాలవాళ్ళు ఏయే మార్గాల ద్వారా భగవంతుణ్ణి పూజించి, సాక్షాత్కరింప చేసుకున్నారో, ఆ మార్గముల నన్నింటిని ఆయన అభ్యసించి చూశారు. తద్వారా, ఆయన ఆ దైవం విభిన్న పద్ధతులలో ఆడే క్రీడలలోని ఆనందాన్ని రుచి చూశారు. ఇతరమయిన ధ్యాస ఏదీ లేకుండా రాత్రింబగళ్ళు గడిచిపోయాయి. అయితే, ఈ యుగంలో ఆయన యిచ్చిన ప్రత్యేకమయిన సందేశం వైరాగ్యము అనే విషయాన్ని నువ్వు గుర్తుంచుకోవాలి. అటువంటి సహజసిద్ధమయిన వైరాగ్యము ఇంతకు పూర్వం ఎవరయినా, ఎక్కడయినా చూశారా? ఇక నువ్వు మాట్లాడుతున్న సర్వమత సమన్వయం విషయానికి వస్తే, శ్రీరామకృష్ణులు దానిని ఆచరించి చూపించిన మాట కూడ నిజమే. ఇతర అవతారాలలో, ఏదో ఒక దృక్పథానికి మాత్రమే ప్రాముఖ్యత నిచ్చి మిగిలినవాటిని వదిలిపెట్టడం జరిగింది.

**–మాతాశ్రీ శారదాదేవి**

## కార్యక్రమములు-మాతృఆశ్రమం

**తేది. 13-01-2025 (సోమవారం):** భోగిపండుగ సందర్భంగా దిగువ మందిరంలో ఉదయం శ్రీకృష్ణపూజ జరుగును.

**తేది. 14-01-2025 (మంగళవారం):** మకర సంక్రాంతిని పురస్కరించుకొని ఉదయం దిగువ ప్రార్థనామందిరంలో గోపూజ జరుగును.

**తేది. 15-01-2025 (బుధవారం):** కనుమ పండుగ సందర్భంగా ఉదయం గోపూజ దిగువను చేయబడును.

**తేది. 26-01-2025 (ఆదివారం):** (రిపబ్లిక్‌డే) గణతంత్రం దినోత్సవం సందర్భముగా ఆశ్రమ ప్రాధమికోన్నత పాఠశాలలో సభ జరుపబడును.

**తేది. 30-01-2025 (గురువారం):** మహాత్మాగాంధీ వర్థంతి సందర్భముగా గాంధీ స్మరణ సభ నిర్వహించబడును.

## వార్తలు-మాతృఆశ్రమం-కాకినాడ శాఖ

**తేది. 07-11-2024 (గురువారం) నుండి 13-11-2024 (బుధవారం):** వరకు దిగువ ప్రార్థనామందిరంలో శ్రీ సాయి సచ్చరిత్ర పారాయణ ఆశ్రమ భక్తులచే జరిగినది.

**తేది. 26-11-2024 (మంగళవారం):** ఆనందాశ్రమ అధ్యక్షులు శ్రీ ముక్తానంద స్వామీజీ జన్మదిన వేడుకలు సందర్భముగా ఎగువ ఓంకార మందిరంలో రామనామ సంకీర్తనం జరిగినది. సాయంత్రం సత్సంగం అనంతరం జ్ఞానేశ్వరి మాతాజీ స్వామి ముక్తానందగారిని సత్కరించారు.

**చాతుర్మాస వ్రత దీక్ష విరమణ** సందర్భంగా యాగశాలలో శ్రీ కుక్కుటేశ్వర శర్మ (పిఠాపురం) పురోహితులచే యాగశాలలో హోమం, పూర్ణాహుతి జరిగినది.

## విశాఖపట్నం శాఖ

**తేది. 17-11-2024 (గురువారం) నుండి తేది 21-11-2024 (ఆదివారం):** విశాఖ ఆశ్రమ శాఖలో శ్రీ వినమ్రానంద మాతాజీ ఆధ్వర్యంలో భాగవత సప్తాహం భక్తులచే జరపబడినది.



## దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ. కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435 కు IFSC Code : SBIN0014774 ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమెయిల్ ద్వారా మొబైల్ నంబరు 7382009962 మరియు రిసెప్షన్ నెంబరు 7815890094కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

## శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ. 100/-, జీవిత చందా రూ. 1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం. 11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)
వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

## విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు : State Bank of India, 11 Sansad Marg, New Delhi -110001
A/c Name : The Mission of peace - FCRA A/c No : 40127798428
Swift Code : SBININBB104

## విరాళములు

1. స్వామి సన్యాసనందజీ (ఆనందాశ్రమం) 3,000/-
2. శ్రీమతి కన్నమ్మాస్ ఫ్యామిలి (ఆనందాశ్రమం) 11,000/-
3. శ్రీమతి శారదగారు, W/o లేటు రామదాసు గారు (ఆనందాశ్రమం) 20,001/-
4. శ్రీ సురేష్‌కుమార్ దవేగారు, శ్రీమతి విశాఖదవే గారు (బిలాస్‌పూర్) 25,000/-
5. శ్రీమతి సి.కె. శశాంక్ అశ్విత గారు (చెన్నై) 10,000/-
6. శ్రీ ఈరంకి వెంకట సుబ్రహ్మణ్యం గారు, (రిటైర్డ్ టీచర్) (అన్నవరం) విద్యాఖర్చుల నిమిత్తం 10,000/-
7. శ్రీమతి రమణి గారు (విశాఖపట్నం) 3,000/-
8. శ్రీమతి & శ్రీ ఎస్. గణపతిరావు, ఇంద్రాణి గార్లు (రాజమండ్రి) 10,000/-
9. శ్రీ కంటిపూడి బలరాం, (టీచర్), శ్రీమతి భవాని టీచర్, (వేట్లపాలెం) గోగ్రాసం నిమిత్తం 12,000/-
10. శ్రీ పాలకుర్తి రాజేష్‌గారు, శ్రీమతి సీతగారు (వేట్లపాలెం) గోగ్రాసం నిమిత్తం 10,000/-
11. శ్రీ సి.హెచ్.వి.వి. సత్యనారాయణ గారు (కైకలూరు) గోగ్రాసం నిమిత్తం 40,000/-
12. శ్రీ కొత్తపల్లి నారాయణ ప్రసాదరావుగారు (కాకినాడ) వీరి తండ్రిగారు శ్రీ కె.రామచంద్రరావు గారి జ్ఞాపకార్థం అన్నదానం నిమిత్తం 9,000/-
13. శ్రీ కె. శివరామ గోపాల్ గారు (విశాఖపట్నం) 10,000/-
14. శ్రీమతి ప్రత్యూష గారు (భీమవరం) డా॥ విఠల్‌గారి కుటుంబ సభ్యులు, కార్తిక సోమవారం అన్నదానం సందర్భముగా 13,000/-
15. శ్రీమతి ఎస్.పావనిశేషన్ గారు (ఆనందాశ్రమం) 21,000/-
16. మేజర్ వై.ఎస్.వి. కుమార్ గారు (మైసూర్) 15,000/-
17. శ్రీ బి. సూర్యనారాయణ గారు (విశాఖపట్నం) 3,000/-



18. శ్రీ తులసి బాలకృష్ణగారు (హైదరాబాదు) 5,000/- వీరి తల్లిదండ్రులు, తులసీ రామమూర్తి శాస్త్రి గారు తులసీ వెంకట సుబ్బలక్ష్మి గార్ల జ్ఞాపకార్థం అన్నదానం
19. శ్రీ నటరాజ్ నమ్మ ఆళ్వార్ గారు (బెంగుళూరు) 5,000/-

## శాశ్వతఅన్నదానం

1. శ్రీ దారపు రామారెడ్డి గారు (కాకినాడ) 10,000/- వీరి పెద్దమ్మ శ్రీమతి కనకమ్మ నర్సింహరెడ్డి గారి జ్ఞాపకార్థం
2. శ్రీ ఆకుల అప్పల రాజశేఖర్ గారు (హైదరాబాదు) 10,000/- వీరి తండ్రి శ్రీ ఎ. అప్పలరాజు గారి జన్మదినం సందర్భముగా

| | |
|---|---|
| **1. మాతృ ఆశ్రమం**<br>శ్రీ శాంతి ఆశ్రమము<br>తోటపల్లి కొండలు,పిన్ : 533 446<br>వయా శంఖవరం, కాకినాడ జిల్లా<br>సెల్ :7382009962<br>రిసెప్షన్ : 7815890094<br>e-mail : srisanthiashram@gmail.com | **4. కోటగిరి శాఖ**<br>పీస్ సెంటర్, డార్‌మోనా రోడ్,<br>కోటగిరి-643217, నీలగిరిజిల్లా,<br>తమిళనాడు,<br>ఫోన్ : 04266- 271945<br>e-mail: vsvmsktg@yahoo.com<br>vsvmsktg@gmail.com |
| **2. విశాఖ : శాంతి ఆశ్రమము**<br>లాసన్స్‌బే, పెదవాల్తేరు-530 017<br>విశాఖపట్నం<br>ఫోన్ : 0891 - 2538689<br>e-mail : srisanthiashramvsp@gmail.com | **5. కాకినాడ శాఖ**<br>శాంతి ఆశ్రమము,అశోక్ నగర్<br>కాకినాడ - 533 004<br>కాకినాడ జిల్లా |
| **3. విశ్వశాంతి క్షేత్రం**<br>కైలాసగిరి<br>విశాఖపట్నం | **6. పిఠాపురం శాఖ**<br>స్టువర్టు పేట,<br>పిఠాపురం-533 450<br>కాకినాడ జిల్లా |

Website : www.srisantiashram.org

## శ్రీ శాంతి ఆశ్రమ ప్రచురణలు

| | |
|---|---|
| 1. శాంతి ప్రదాత శ్రీ స్వామి ఓంకార్ ఆత్మకథ | 100/- |
| 2. ఓంకార సద్బోధామృతము | 70/- |
| 3. సోహం | 10/- |
| 4. ఓం జపం | 10/- |
| 5. మౌనపు ఘడియలు | 30/- |
| 6. ప్రేమయే దైవము | 10/- |
| 7. భగవత్సాక్షాత్కారము ఇప్పుడు ఇక్కడే | 10/- |
| 8. శాంతి దళములు | 10/- |
| 9. ఆధ్యాత్మిక మెరుపులు | 10/- |
| 10. సత్సంగ సందేశములు | 30/- |
| 11. ఓంకార సూక్తులు | 10/- |
| 12. ఓంకార స్తోత్ర కదంబం | 10/- |
| 13. శాంతి సూక్తులు | 10/- |
| 14. శాంతి ప్రార్థన | 20/- |
| 15. శ్రీ శాంతి స్తోత్రమాల | 30/- |
| 16. స్వామి ఓంకార్ ఆత్మదర్శిని | 20/- |
| 17. సందేశ తరంగిణి | 40/- |
| 18. నా చెల్లి పునర్జన్మ | 10/- |
| 19. నేను ఆంగ్లభాష ఎలా నేర్చుకొన్నాను. | 20/- |
| 20. శ్రీశ్రీశ్రీ ఓంకార స్వామి స్తోత్రము | 20/- |
| 21. శాంతి దూత స్వామి ఓంకార్ | 30/- |
| 22. స్వామి ఓంకార్ జీవిత విశేషాలు | 10/- |
| 23. శ్రీ శాంతి ఆశ్రమ చరిత్ర (1917-2020) | 100/- |
| 24. ధ్యానము | 30/- |
| 25. పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి దివ్య సందేశములు దేశ విదేశీయ పర్యటనలు | 50/- |
| 26. ప్రార్థనలు - ధ్యానములు | 20/- |
| 27. విశ్వ ప్రార్థన | 20/- |
| 28. శ్రీ శాంతి ఆశ్రమం శతాబ్ది సంచిక | 120/- |
| 29. నిత్య సందేశములు | 20/- |
| 30. ఆంతర్య భావనలు | 20/- |
| 31. శ్రీ ఓంకార బోధామృతం | 20/- |
| 32. నాల్గు దశలలో ఉపదేశము | 10/- |
| 33. శాంతి ప్రార్థన - స్వామి ఓంకార్ | 20/- |

This Periodical is Registered with Registar of Newspapers, New Delhi Vide R.No. 3447/57,
Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2024-2026

## SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

| | |
|---|---|
| 1. Auto Biography of swami Omkar (2 Volumes) | Rs. 150/- |
| 2. Life and Teachings of Swami Omkar | Rs. 10/- |
| 3. Soham | Rs. 10/- |
| 4. Cosmic Fast | Rs. 20/- |
| 5. Meditation | Rs. 10/- |
| 6. Om Japa | Rs. 10/- |
| 7. Control of Mind | Rs. 30/- |
| 8. Cosmic Flashes | Rs. 10/- |
| 9. In the Hours of Silence | Rs. 10/- |
| 10. The Soul of Omkar | Rs. 10/- |
| 11. How I learned English | Rs. 10/- |
| 12. Reincarnation of my Little Sister | Rs. 10/- |
| 13. God Realization Now and Here | Rs. 10/- |
| 14. Mystic Prayers and Poems | Rs. 20/- |
| 15. The Divine Voice of Omkar | Rs. 40/- |
| 16. Auto Biography of Omkar (Revised Edition) | Rs. 100/- |
| 17. Petals of Peace | Rs. 20/- |
| 18. The Story of my life and Work | Rs. 10/- |
| 19. Priceless legacy of Swami Omkar | Rs. 10/- |
| 20. The Four Initiations | Rs. 10/- |
| 21. Musings | Rs. 20/- |
| 22. Peace Prayer | Rs. 20/- |

**THE MISSION OF PEACE**
**శ్రీ శాంతి ఆశ్రమము**
పోస్టు: శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446
కాకినాడ జిల్లా, (ఆం.ప్ర.)
ఫోన్ : 7382009962
email: srisanthiashram@gmail.com
www: www.srisantiashram.org

Book Post

______________________

______________________

______________________

Published by MVV Satyanarayana on behalf of The Mission of Peace - Sri Santi Ashram and printed at Mohan Graphics, Kakinada - 533 001. Ph:0884-2361419 and Published at Thotapalli Hills-533 446, Ph: 73820 09962 Editor : Swamini Vinamrananda